ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలు



పూజలో పాల్గొన్న కూన శ్రీశైలంగౌడ్

దుండిగల్: ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలకు నిలయాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ గణేష్‌నగర్‌లోని వీరాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం సర్వదేవత మూల మంత్ర జపాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయంలో ప్రతిష్ఠించబోయే గణపతి, సుబ్రమణ్య స్వామి, నాగదేవత, నవగ్రహాలను దర్శించుకున్నారు. రానున్న రోజుల్లో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, నేతలు రాము గౌడ్, మల్లేష్ యాదవ్, గోపాల్, శ్రీకాంత్ రెడ్డి, పూలేందర్ రెడ్డి, సుజిత్, మధుకర్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులు అందజేస్తున్న శంభీపూర్ కృష్ణ

దుండిగల్: అర్హులు సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు శంభీపూర్ కృష్ణ అన్నారు. రూ.3.39 లక్షల విలువ గల చెక్కులను గురువారం 15 మందికి శంభీపూర్‌లోని కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల ఆరోగ్య భద్రతకు సీఎం రిలీఫ్‌ఫండ్ భరోసా కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు మహేందర్ యాదవ్, భరత్ కుమార్, సీనియర్ నాయకులు ఉట్ల శ్రీహరి, గణేష్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్



పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

నిజాంపేట్ : రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా చేపట్టారు. 10, 11, 12 డివిజన్‌లలో మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. స్వాతంత్య్ర పోరాటంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు, స్వాతంత్య్రం వచ్చిన తరువాత దేశంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నగేష్‌చారి, కొలన్ వీరేందర్‌రెడ్డి, చిట్ల దివాకర్, రఫియాబేగం, కడియాల ఇందిర, శ్రీనివాస్‌రెడ్డి, చౌదరి, ప్రవీణ్, జీవన్‌రెడ్డి, కుమార్ యాదవ్, సురేష్ యాదవ్, జగన్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, నాని, వర్మ రాజు, కృష్ణంరాజు, పండు శ్రీనివాస్, విజయ్, రమేష్, మీసాలరాజు, గంగాధర్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి

కుత్బుల్లాపూర్ : సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని పురస్కరించుకొని గురువారం కుత్బుల్లాపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు రాజ్ కుమార్ గౌడ్, వ్యాస్ గౌడ్, నల్ల ప్రసాద్, జ్ఞానేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

బుక్ చేసుకున్న వెంటనే ట్యాంకర్లు



పెండింగ్ ట్యాంకర్ల జాబితాను పరిశీలిస్తున్న జీఎం, డీజీఎం

చింతల్: నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని కుత్బుల్లాపూర్ జలమండలి జీఎం అశోక్ అన్నారు. గురువారం షాపూర్‌నగర్ ఫిల్లింగ్ స్టేషన్ 2ను డీజీఎం రాజేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. బుక్ చేసుకున్న ట్యాంకర్ల రిజిస్ట్రార్‌ను పరిశీలించిన జీఎం.. పెండింగ్ లేకుండా త్వరితగతిన ట్యాంకర్లను పంపే విధంగా చర్యలు తీసుకోవాలని సెక్షన్ మేనేజర్ రమ్యభారతిని ఆదేశించారు.



ఎస్వీ కోఆపరేటివ్ సొసైటీ వ్యూ

ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలో..

పుట్టగొడుగుల్లా స్క్రాప్ గోదాములు

- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న కాలనీల ప్రజలు
- పట్టించుకోని అధికారులు

జీడిమెట్ల: ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీ జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో ఒక వింగ్ ఇది. 1984లో జీడిమెట్లతో పాటు ప్రారంభమైంది. 2006లో 300పై చిలుకు పరిశ్రమలతో కొత్త సొసైటీగా ఏర్పాటైంది. ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీ మొత్తం 80 ఎకరాల పైచిలుకు స్థలంలో విస్తరించి ఉంది. ఇక్కడ కరోనాకు ముందు వరకు డ్రగ్స్, ఫార్మా, ఇంజినీరింగ్, ప్యాబ్రికేషన్, రీసైక్లింగ్ పరిశ్రమలు ఉండేవి. కరోనా తర్వాత ఇక్కడ స్క్రాప్ గోదాములు ఏర్పాటు కావడంతో దాదాపు పావలా వంతు పరిశ్రమలు సొసైటీ నుంచి వైజాగ్, మేడ్చల్, శామీర్‌పేట వైపు తరలింపబడ్డాయి. దీనికి ప్రధాన కారణం ఇక్కడ స్క్రాప్ దందా పెరగడమే.

ఎక్కడ చూసినా..

ప్రస్తుతం ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీలోని పాత ఠాగూర్ కెమికల్స్ ప్రాంతంలో ఎక్కడ చూసిన స్క్రాప్ గోదాములే దర్శనమిస్తున్నాయి. ప్రతినిత్యం వందలకొద్ది లారీలు, డీసీఎంలతో స్క్రాప్‌తో దందా నిర్వహిస్తున్నారు. అధికారులు సైతం చూసి చూడనట్లు వదిలేయడంతో దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది.

రసాయన కవర్లు, డ్రమ్ములు, మెడికల్ వేస్ట్..

స్క్రాప్ గోదాముల్లో ఎక్కడ చూసినా రసాయన కవర్లు, డ్రమ్ములు, మెడికల్ వేస్ట్ దర్శనమిస్తాయి. నగరంలోని వివిధ పరిశ్రమలు, హాస్పిటల్స్, డయగ్నొస్టిక్స్, మెడికల్ ల్యాబ్స్ నుంచి మెడికల్ వేస్ట్‌ను తీసుకొచ్చి ఇక్కడ వాటిని శుభ్రపరిచి తిరిగి పరిశ్రమలకు సప్లయ్ చేస్తుంటారు. చిన్న మొత్తం పెట్టుబడితో ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తుండటంతో చాలా మంది వ్యాపారులు ఇదే దందాను కొనసాగిస్తూ ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీని అడ్డాగా చేసుకుంటున్నారు. ఇలాంటి స్క్రాప్ గోదాముల నుంచి విపరీతమైన దుర్వాసన వస్తుండటంతో కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతులు లేని స్క్రాప్ గోదాములను మూసివేయించాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వీస్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపల్ పరిధిలో రోడ్డు ఆక్రమణలపై మున్సిపల్, హైడ్రా అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జయభేరి, ఉమామహేశ్వర కాలనీ, సినీ ప్లానెట్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వెలిసిన దుకాణాలను గుర్తించి జేసీబీతో కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. దుకాణదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామని తెలిపారు. రోడ్డుపైకి నిర్మాణాలు చేపట్టడంతో తరచూ ట్రాఫిక్‌జామ్ అవుతోందని, ఈ క్రమంలోనే హైడ్రా అధికారులతో కలిసి కూల్చివేతలు చేపట్టామని పేర్కొన్నారు.



సినీ ప్లానెట్ సమీపంలో దుకాణాలను కూల్చివేసిన దృశ్యం



రోడ్డు ఆక్రమణలకు మార్కింగ్ చేయిస్తున్న కమిషనర్

రాజీవ్ యువ వికాసం పథకానికి స్పందన

మేడ్చల్ జిల్లాలో 15,497 దరఖాస్తులు

సాక్షి, సిటీబ్యూరో: బీసీ అభివృద్ధిశాఖ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 'రాజీవ్ యువ వికాసం' పథకంపై చేపట్టిన అవగాహన కార్యక్రమాలతో జిల్లాలో ఈ పథకానికి ఇప్పటి వరకు 15,497 మంది నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తు చేసుకున్నారు .

ఈనెల 14వ తేదీ వరకు అవకాశం..

రాజీవ్ యువ వికాసం పథకానికి 21–55 ఏళ్ల (01 జూలై 2025 నాటికి) ఉన్న అభ్యర్థులు ఈనెల 14 వరకు దరఖాస్తు చేసుకోవటానికి అవకాశం ఉందని బీసీ అభివృద్ధిశాఖ జిల్లా అధికారి ఝాన్సీ రాణి చెప్పారు. 21 నుంచి 60 ఏళ్లున్న అభ్యర్థులు భూ సంబంధ, ఉద్యాన, వ్యవసాయ పరికరాల పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. దరఖాస్తు చేసుకునే అభ్యర్థి ఏడాది ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షలు, పట్టణ/ మున్సిపాలిటీ ప్రాంతాల వారికి రూ.2 లక్షలు మాత్రమే ఉండాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు సూచించిన ధ్రువీకరణ పత్రాలను జతపరచాల్సి ఉంటుంది. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు లేదా ఆదాయ ధ్రువపత్రం, కుల ధ్రువీకరణపత్రం (తెలంగాణ ఏర్పడిన తర్వాత జారీ చేసినది మాత్రమే), డ్రైవింగ్ లైసెన్స్ (రవాణా రంగం వారికి మాత్రమే), పట్టాదార్ పాస్‌బుక్ (వ్యవసాయరంగం వారికి మాత్రమే), సదరం సర్టిఫికెట్ (దివ్యాంగులకు మాత్రమే) ప్రతులతో సహా పాస్‌పోర్టు సైజు ఫోటోను దరఖాస్తుతో జతపరచాల్సి ఉంటుంది.

'మీ సేవ' నుంచి జారీ చేసినవి మాత్రమే..

మీ–సేవ నుంచి జారీ చేసిన ధ్రువపత్రాలు మాత్రమే అంగీకరించబడతాయని బీసీ అభివృద్ధి శాఖ స్పష్టం చేస్తోంది. మరిన్ని వివరాలకు కలెక్టరేట్‌లోని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని ఆ శాఖ వర్గాలు కోరుతున్నాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా బీసీ అభివృద్ధిశాఖ ప్రకటించింది.

ఘనంగా ఛట్‌పూజ

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ అయోధ్యనగర్‌లో గురువారం ఉత్తర భారతీయులు ఛట్ పూజను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. అయోధ్యనగర్‌లో ఏర్పాటు చేసి ఛట్‌పూజా కొలన్‌లో మహిళల దీపాలు వదిలి నైవేద్యం సమర్పించారు. అందరూ సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య



భవాని(ఫైల్)

కుత్బుల్లాపూర్: ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల వివరాల ప్రకారం..పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ధనాంజనేయులు, భవాని భార్యాభర్తలు. వీరికి లక్షిత(03), షణ్ముఖ్ తేజ్(15 నెలలు) పిల్లలు ఉన్నారు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ఎం.ఎస్.రెడ్డి నగర్‌లో కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నారు. కుమార్తెకు కిడ్నీ ఇన్‌ఫెక్షన్ ఉండటంతో రెండుసార్లు ఆపరేషన్ చేయించారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో భార్యాభర్తల నడుమ గొడవలు తలెత్తాయి. జీవితంపై విరక్తి చెందిన భవాని గురువారం భర్త కూరగాయలు తెచ్చేందుకు బయటకు వెళ్లగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

పన్ను వసూళ్లలో భేష్



ప్రశంసా పత్రం అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ

నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 82.79శాతం, రూ. 71 కోట్లకు 53.72 కోట్ల ఇంటి పన్ను వసూలైంది. దీంతో గురువారం సీడీఎంఏ శ్రీదేవి చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

అనుమతులు లేకుండా మహిళా భవన్ పనులు!

జగద్గిరిగుట్ట : అనుమతులు లేకుండా మహిళా భవన్ పేరుతో సుమారు 400 గజాలలో పనులు ప్రారంభించారు. జగద్గిరిగుట్ట, కూనా మహాలక్ష్మి నగర్ బతుకమ్మకుంట వద్ద 2 వారాల క్రితం అధికార పార్టీ నియకులు కొందరు పాల్గొని భూమి పూజ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా గురువారం జేసీబీలతో చదును చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు తెలిపారు.



వారం క్రితం ఇలా....



జేసీబీతో పనులు చేస్తున్న దృశ్యం

అధికారులు చొరవ చూపి పనులను అడ్డుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్ఐ ఖలీంను వివరణ కోరగా.. మహిళా భవన్ ప్రతిపాదన విషయమై కలెక్టర్‌కు లెటర్ పంపించామని, అక్కడి నుంచి ఆదేశాలు వచ్చేవరకు పనులు నిలిపి వేయాలని చెప్పినటుల ఆయన తెలిపారు. ఆదేశాలు వచ్చే వరకు ఎటువంటి పనులు చేపట్టినా చర్యలు తప్పవని ఆర్ఐ హెచ్చరించారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



సుభాష్‌నగర్: తెలంగాణలో నిరంకుశ పాలన కొనసాగుతోందని, సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ దళారిగా వ్యవహరిస్తున్నారని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి ఒక్కంటి దయాకర్ అన్నారు. హెచ్‌సీయూలో విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జిని నిరసిస్తూ గురువారం బీజేవైఎం ఆధ్వర్యంలో సూరారం చౌరస్తాలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌సీయూను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పర్యావరణాన్ని, మూగజీవాలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్న విద్యార్థులపై రాష్ట్ర ప్రభుత్వం లాఠీఛార్జి చేయించడం దారుణమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. దిష్టిబొమ్మను దహనం చేసే క్రమంలో పోలీసులు అడ్డుకోవడానికి యత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వారాల మహేష్‌కుమార్, బీజేవైఎం కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల విజయసాయి. బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కంది శ్రీరాములు, అసెంబ్లీ కో కన్వీనర్ శ్యామ్‌కిరణ్, డివిజన్ అధ్యక్షుడు ఈశ్వర్, విజయ్‌కుమార్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పరిశ్రమలో ఫైర్‌సేఫ్టీ తప్పనిసరి



మాట్లాడుతున్న డీసీపీ సురేష్‌కుమార్

జీడిమెట్ల: పరిశ్రమల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా ఉండాలంటే ఫైర్‌సేఫ్టీ ఉండాలని బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ అన్నారు. గురువారం జీడిమెట్ల ఇండస్ట్రీయల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇండస్ట్రీయల్ ఫైర్‌సేఫ్టీ అవగాహన సదస్సుకు ఆయన టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ అనురాధతో కలిసి పాల్గొని మాట్లాడారు. ప్రతి పరిశ్రమ కచ్చితంగా ఫైర్‌సేఫ్టీ ఎన్‌వోసీ కలిగి ఉండాలన్నారు. ఏదైనా పరిశ్రమ ఫైర్ అధికారుల నుంచి ఎన్‌వోసీ ఉండకపోతే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఫైర్‌స్టేషన్ అధికారులు సైతం పరిశ్రమల్లో అగ్నిమాపక నివారణ పరికరాలు ఉన్నాయా లేదా తనిఖీలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ హన్మంత్‌రావు, ఏడీఎఫ్‌వో శ్రీనివాస్, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్, ఐలా చైర్మన్ పి.డి.ఎస్.ఎన్ రాజు, జీడిమెట్ల ఇండస్ట్రీస్ ఎక్స్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌రెడ్డి, పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన పారిశ్రామికవేత్తలు

ప్రజల సహకారం, సిబ్బంది కృషితోనే రికార్డు స్థాయిలో ఆస్తి పన్ను వసూలు సాధ్యపడిందని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం నగరంలోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి హెచ్‌ఆర్‌డీఐ భవనంలో శానిటేషన్, ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై రివ్యూ మీటింగ్ జరిగింది.



ఆస్తి పన్ను వసూలు విషయంలో కమిషనర్ కృష్ణారెడ్డి తెలంగాణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ టి.కె.శ్రీదేవి చేతుల మీదుగా అప్రిసేషన్ సర్టిఫికెట్ అందుకున్నారు.

– కుత్బుల్లాపూర్

24 గంటల్లో తల్లిదండ్రుల చెంతకు..

ఘట్‌కేసర్: అదృశ్యమైన ఓ బాలిక ఆచూకీ లభించింది. పట్టణంలో బుధవారం గణశ్రీ (10) మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించి 24 గంటల్లోగా తల్లిదండ్రులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ పరుశురాం తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి హనుమాన్‌వాడకు చెందిన గుంజ స్రవంతి, రాజశేఖర్ దంపతుల కుమార్తె గణశ్రీ కుమారుడితో ఘట్‌కేసర్ డీపీఎస్ స్కూల్ ఎదురుగా నివాసం ఉంటోంది. తల్లి ఇళ్లల్లో పని ముగించుకుని ఇంటికి వచ్చేసరికి కుమార్తె కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. రంగంలోకి దిగిన పోలీసులు బాలిక ఆచూకీ కోసం బృందాలుగా ఏర్పడి వెతికారు. ఆడుకోవడానికి ఎవరూ లేకపోవడంతో గతంలో నివాసం ఉంటున్న హన్మకొండకు ఆర్టీసీ బస్సులో వెళ్లింది. వెంటనే ఎస్సై నరసింహ ఆధ్వర్యంలో పోలీసులు హన్మకొండకు చేరుకుని బాలికను ఘట్‌కేసర్‌కు తీసుకొచ్చి గురువారం తల్లిదండ్రులకు అప్పగించారు. విచారణలో బాలిక చదువుకోవడానికి ఆసక్తి ఉందని తెలిపింది. దీంతో పోలీసులు తల్లిదండ్రుల అనుమతితో అల్వాల్‌లోని సీడబ్ల్యూ (చైల్డ్ వెల్ఫేర్ కమిటీ) సఖి సెంటర్ సిబ్బందికి అప్పగించారు. బాలిక ఆచూకీ కనిపెట్టిన సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.



సుభాష్‌నగర్‌లో నాలా నుంచి రోడ్డుపైకి కొట్టుకొచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలు

సుభాష్‌నగర్‌లో రోడ్డుపైకి చేరిన వరద



మీనాక్షి కాలనీలో రోడ్లను ముంచెత్తిన నీరు



రోడ్లు జలమయం

ఉదయం నుంచి ఉక్కపోతగా ఉండి సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి కురిసిన వర్షానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో ప్రజలు వేడిమి నుంచి ఉపశమనం పొందారు. పలు చోట్ల రోడ్లపైకి వరద చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

–కుత్బుల్లాపూర్